08102023-MAI-08_Layout 1 10/8/2023 3:32 AM Page 1

కాలం వంతెన మీద..

నా నేల మీద మంచిరాలు,
మనీదులున్నాయి
గురుద్వారాలు, చర్చీలు ఉన్నాయి
జైన దేవాలయాలు, బౌద్ధ ఆరామాలు
పార్శీల ప్రార్థనా మంచిరాలు,
మరెన్నో పవిత్ర స్థలాలు ఉన్నాయి

వినా ఇక్కడ
నా దేహం నాది అన్న స్వరాలు
శ్రమ శక్తులవుతాయి
విశ్వాసమున్న వాడు, నమ్మకం లేనివాడు
ఇద్దరూ కలిసి చెమటోడ్చే కూలీలవుతారు
పాలాల్లో బురద కాళ్లను
నాగలి కర్రులు చేసి
రాజనాలు పండిస్తారు
విత్తనమై ఈ మట్టి పొరలతోనే
స్నేహం చేస్తారు

ఆకలికి కడుపు నింపి,
ఎండిన దొక్కలకు నేడ బీర్చి
తిరిగే శ్రమ శక్తికి ఊపిరి అవుతారు
శ్రమకు, ఆకలికి కులం లేదు, మతం లేదు
మట్టికి జాతి లేదు, వర్ణం లేదు
విత్తనానికి మంచిరం లేదు, మనీదు లేదు,
గురుద్వార లేదు, చర్చీలేదు
ఆకలి కడుపే దాని నివాసం,
మట్టి పొరలే దాని అంగ వస్త్రం
కారుణ్యమే దాని గుణం,
త్యాగమే దాని కులం

మనం విత్తనమవుదాం,
ఈ మట్టికి శ్వాస అవుదాం
ప్రసూతిలో ప్రసవవేదన
పడుతున్న తల్లి ఈ నేల
కొత్త జన్మకు స్వాగతిద్దాం,
కాలం వంతెన మీద నిలబడే
కొత్త పాట పాడుకుందాం..

డాక్టర్ రూప్ కుమార్ డబ్బీకార్
99088 40186

వ్యాఖ్యాన చక్రవర్తి మల్లినాథుడు

తన అసామాన్య ప్రతిభాపాటవాలతో తెలుగువారి, అందునా తెలంగాణ జాతి కీర్తిని ఆసేతుహిమాచల పరివ్యాప్తం చేసిన విద్వన్మణులలో అగ్రగణ్యుడు మహామహోపాధ్యాయ వ్యాఖ్యానచక్రవర్తి కోలాచల మల్లినాథసూరి. మహాకవి కాళిదాసు, భారవి, మాఘమహాకవి, శ్రీహర్షుడు, భట్టిమహాకవి వంటి ఉద్దండులు రచించిన మహాకావ్యాల మహౌన్నత్యాన్ని అర్థం చేసుకునేట్టు అనితరసామాన్యమైన వ్యాఖ్యాన పరంపరను అందించిన మల్లినాథ సూరి సంస్కృత వాఙ్మయంలో, వ్యాఖ్యాన రంగంలో చక్రవర్తిత్వ బిరుదాన్ని పొందిన ఏకైకపండితుడు.



శాస్త్రాధ్యయనానికి, వేదాధ్యయనానికి, అవధానవిద్యకు, పౌరాణికవిద్యకు, ధర్మశాస్త్రబోధనకు ప్రాచీనకాలం నుంచే ప్రసిద్ధిగాంచిన తెలంగాణాలోని మెదక్ జిల్లా కోలాచలం (ప్రస్తుతం కుల్చారం)కు చెందిన మహపురుషుడు. మల్లినాథసూరి అపార పాండిత్యానికి ముగ్ధుడైన రాచకొండ అధిపతి సర్వజ్ఞ సింగభూపాలుడు మహామహోపాధ్యాయ, వ్యాఖ్యాన చక్రవర్తి ఇత్యాది బిరుదులతో సత్కరించినట్టు శాసనాలు స్పష్టం చేస్తున్నాయి.

> మల్లినాథసూరి తాత పేరు కూడ మల్లినాథుడే. ఆ కాలంలోనే తన శతావధానాలతో కవిపండితులందరి మెప్పు పొందిన మహాకవి ఆయన. కాకతీయవంశపు రాజైన వీరరుద్రుని చేత సన్మానింపబడిన మహామేధావి.

కోలాచలాన్వయాబ్ధిందుః మల్లినాథో మహాయశాః, శతావధానవిఖ్యాతో వీరరుద్రాభివర్ధితః అని పదయోజనాకారుడైన వెంకట నారాయణ పండితుడు ఆ విషయాన్ని స్పష్టం చేశాడు. 'ప్రతాపరుద్రీయం'కు రత్నాపణ వ్యాఖ్యానం వ్రాసిన కుమారస్వామి తను వ్యాఖ్యాతృ సార్వభౌముడైన మల్లినాథసూరి తనయుణ్ణని అనేక సందర్భాల్లో తెలిపాడు. మల్లినాథుడు బాల్యంలో తనతండ్రి దగ్గరనే విద్యాభ్యాసం చేశాడని, ఆ తర్వాత అనుష్ఠానబలంతో శాస్త్రాలన్నీ వివిధగురువుల వద్ద అభ్యసించాడని పరిశోధకుల అభిప్రాయం.

అంతవరకు అక్కడక్కడా కావ్యాలకు, శాస్త్ర గ్రంథాలకు రాసిన వ్యాఖ్యానాల అసమగ్రతను, క్లిష్టతను, అన్వయ క్రమరాహిత్యాన్ని గ్రహించి మహాకవుల కావ్యాలకు అతుల్యమైన వ్యాఖ్యానాలను రచించాడు. **పదచ్ఛేదః పదార్థోక్తిః విగ్రహో వాక్యయోజనా, ఆక్షేపశ్చ సమాధానం వ్యాఖ్యానం షడ్విధం మతమ్** అని వ్యాఖ్యానలక్షణం చెప్పబడినప్పటికీ అది వ్యాకరణశాస్త్రాన్ని దృష్టిలో పెట్టుకొని చెప్పబడిందే, అయితే దీన్నే ఆధారంగా తీసుకొని మహాకావ్యాలకు ఇతరశాస్త్రగ్రంథాలకు కూడ వ్యాఖ్యానం రచించి వ్యాఖ్యానానికి ఒక కొత్త రూపాన్ని లక్షణాన్ని నిరూపించిన సుధీమణి మల్లినాథసూరి.

నా మూలం లిఖ్యతే కించిత్ నానపేక్షితము చ్యతే అని దృఢంగా చెప్పిన మొట్టమొదటి వ్యక్తి మల్లినాథసూరి. ఆయన వ్యాఖ్యానవల్లరిని మల్లెపూల గుబాళింపుతో పోల్చారు విద్వాంసులు. ఆయనే లేకపోతే ఎన్నో మహాకావ్యాలు నూరు ఆమడల దూరంలో ఉండిపోయేవి అనడంలో ఏమాత్రం సందేహం లేదు. వ్యాఖ్యానాల్లో మల్లినాథుని పాండిత్యపు లోతును గమనించుటకు యత్నిస్తే ఎన్ని శాస్త్రాలలో ఆయనకు ఎంత దృఢమైన ప్రవేశం ఉందో మన ఊహక్కూడ అందదనడంలో ఆశ్చర్యం లేదు. వేదాలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు, స్మృతులు, సంపూర్ణ వ్యాకరణశాస్త్రం, తర్కం, పూర్వమీమాంస, వేదాంత, అర్థశాస్త్రం, కామశాస్త్రం, ఆయుర్వేదం, జ్యోతిశ్శాస్త్రం,అశ్వ, గజ, రత్నాది శాస్త్రాలు, శకునశాస్త్రం, సాముద్రికశాస్త్రం, మంత్రశాస్త్రం, నాట్యశాస్త్రం ఇత్యాదుల విశేషాలన్ని సందర్భోచితంగా తన వ్యాఖ్యానాల్లో చూపెట్టిన వ్యక్తి కేవలం మల్లినాథపండితుడే. అమరకోశం, మేదినీకోశం, వైజయంతీకోశం, నానార్థరత్నమాల, విశ్వకోశం, ద్విరుక్తకోశం, యాదవ నిఘంటువు ఇత్యాది అనేకనిఘంటువుల ప్రామాణ్యాన్ని అవసరమున్న చోటల్లా ఉదాహరించిన మహామేధావి మల్లినాథసూరి. అంతేగాక అష్టాదశ పురాణాలలోని అంశాలనెన్నింటినో సందర్భోచితంగా ప్రమాణంగా చూపెట్టిన పురాణ విజ్ఞాన సర్వస్వం మల్లినాథుడు. వ్యాకరణ విషయకమైన సందేహం ఆయా కావ్యాల్లో తలెత్తినప్పుడు సాధారణంగా పండితులు అష్టాధ్యాయిని, వైయాకరణ సిద్ధాంత కౌముదిని మాత్రమే అనుసరించి పదప్రయోగంలో కానీ, ధాతుప్రయోగంలో కానీ మహాకవుల ప్రయోగాలను సమర్థించలేకపోవడం సాధారణమే, కాని మల్లినాథసూరి ఐంద్రం చాంద్రం కాశకృత్స్నం కౌమారం శాకటాయనమ్, సారస్వతం చాపిశలం శాకలం పాణినీయకమ్ అనే నవవ్యాకరణాలతో పాటు సరస్వతీ కంఠాభరణం, జైనేంద్ర వ్యాకరణం, హైమ వ్యాకరణం వంటి గ్రంథాలు, కాశికా, పదమంజరీ, మహాభాష్యాది వ్యాఖ్యానాలను కూడ ఉదాహరిస్తూ మహాకవులందరిని, వారి కవితాధారను సమర్థించిన తీరు అద్భుతం. అందుకే కాశీకి వెళ్లి మల్లినాథుని వ్యాఖ్యాసహితంగా పంచమహాకావ్యాలు మేఘసందేశం, భట్టికావ్యం అభ్యసించిన వారిని మహావిద్వాంసునిగా తలచేవారు.

ఒక కావ్యంలోని రచనాసౌందర్యం అనేది అనేక విషయాలపై ఆధారపడి ఉంటుంది. ఆ కావ్యంలో ఉపయోగించిన భాష, సమయానుకూలంగా ఆ భాషలో కవి చూపిన మార్పులు, ఛందో విచ్ఛిత్తి, వర్ణనా నైపుణ్యం, అలంకార విన్యాసం, ఆయా పాత్రలను చిత్రించే చాతుర్యం, కథాకథన కౌశలం ఇత్యాదులన్నీ కలిసి సామూహికంగా కావ్య సౌందర్యానికి తోడ్పడుతాయి. ఎంత ప్రతిభా సంపన్నులైన కవులైనప్పటికి తమ కవితాధారాప్రవాహంలో వారు ఈ గుణాలను, ఈ లక్షణాలను గురించి ఆలోచించరు. అయి తే వీటి నన్నింటిని తాను అవగతం చేసికొని, ఆ మహాకవుల ప్రతిభాపాటవాలను సహృదయులకు ఇతోధికంగా ఆనందం కలిగించుటకు అపూర్వమైన సామర్థ్యం కావాలి వ్యా ఖ్యాన కర్తకు. అటువంటి అప్రతిమ విద్వత్తు కలిగిన మహామనీషి మల్లినాథుడు మాత్ర మే.

ఆచార్య కశోజ్జుల నీలకంఠం

పొంతనలేని విషమూర్ఛితములైన వ్యాఖ్యలతో అలమటించి పోయిన కాళిదాసుని మూడు కావ్యాలకు సంజీవిని పోశాడు ఈ మల్లినాథ మహర్షి. అర్థశాస్త్ర పాటవంతో, వ్యాకరణ వైదుష్యంతో జటిలమనిపించిన భారవికవి కిరాతార్జునీయానికి ఘంటాపథం వ్యాఖ్య రచించి సులభతరం చేశాడు. అలాగే దురవగాహమైన భాషాసంపదతో నిండిన మాఘుని శిశుపాలవధ కావ్యాన్ని సర్వంకష వ్యాఖ్యతో అలంకరించాడు. విద్వదౌషధం అని పేరు పొందిన శ్రీహర్షుని నైషధకావ్యానికి జీవాతు వ్యాఖ్యా సహృదయ పాఠకులలో జీవింపజేశాడు. శాస్త్రకావ్యమైన భట్టికావ్యానికి సర్వప థీనం అనే వ్యాఖ్యానం రచించి లోకానికి మహోపకారం చేశాడు. వ్యాఖ్యానాలకు మల్లినాథసూరి పెట్టిన పేర్లే వాటి ఔచిత్యాన్ని, సార్థక్యాన్ని, సామర్థ్యాన్ని కూడ తెలుపుతాయి. ఆ మహాకవుల కవిత్వంలోని సౌందర్యాన్ని ఆవిష్కరించడంలో ఎంత నైపుణ్యాన్ని చూపిస్తాడో వాటిలో దాగి ఉన్న దోషములను అతి సున్నితంగా చూపే ప్రజ్ఞ కూడ కనబరుస్తాడు. సంపాదకుల పొరపాట్లతో కావ్యం మధ్యలో వచ్చి చేరిన ప్రక్షిప్తాలను గమనించి ఇది ఖచ్చితంగా కాళిదాసు రచన కాదని నిరూపిస్తాడు. అసాధారణమైన లోకజ్ఞానం, విభిన్నమైన సంప్రదాయాలు, విశిష్టమైన ధర్మసూక్ష్మాలు, ఖగోళశాస్త్రం, భూగోళశాస్త్రం, వేదవిహితమైన కర్మలు మొదలగు వాటితో మల్లినాథసూరి వ్యాఖ్యానం ఒక విజ్ఞాన విపణి. ఆధునికుల వలే, పాశ్చాత్య విద్వాంసులవలే ఏ గ్రంథాన్నైనా ఉదాహరిస్తున్నపుడు ఆ సందర్భాన్ని తెలుపకుండా పేజీ నంబరు వేసి వదిలిపెట్టకుండా ఆయా గ్రంథాల్లో చెప్పిన అంశాలను సుస్పష్టం చేసి అధ్యయనపరులకు పరమానందాన్ని కలిగించిన మహోపకారి మహామేధావి మల్లినాథసూరి.

> పదహారు గ్రంథాలకు వ్యాఖ్యానాలు రాసి, స్వయంగా కూడ ఎనిమిది గ్రంథాలు రచించాడు మల్లినాథసూరి. వీటిలో అనేక గ్రంథాలు ఇంకా ముద్రించబడలేదు.

ఈవిధంగా అసామాన్యమైన విద్వత్తు కలిగినవాడు, వేదవేదాంగాది చతుర్దశ విద్యలతో పాటు సంస్కృతంలోని సర్వవిధశాస్త్ర పారంగతుడు, వ్యాఖ్యానరచనలో అగ్రగణ్యుడు, తాను జన్మించిన మెదక్ జిల్లాలోని కోలాచల (కుల్చారం)లో మహామహోపాధ్యాయ కోలాచల మల్లినాథసూరి పేరుతో సంస్కృత విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలని నిర్ణయించిన తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బహుధా అభినందనీయులు.

విజయతాం శ్రీకోలాచల మల్లినాథ విబుధః
జయతు తెలంగాణా, జయతు సంస్కృతమ్

(వ్యాసకర్త : డైరెక్టర్, సంస్కృత అకాడమీ, ఓయూ)

ప్రతిరోజు ఆమె ఒక సూర్యోదయం

పాడ్డు పాడ్డున్నే
ఆమె నా ముందు వెచ్చని తేనీరవుతుంది
గుమ్మం ముందు వాలిన పేపర్ వైపు
నా రెండు కండ్లు సారిస్తానా...
పత్రికలో ఆమె
పదునైన అక్షరాల కొడవలి
మెరుగైన లక్షణాల పిడికిలి

కన్నీళ్లు కాటుక కళ్ల్లో దాచుకొని
కమ్మని వంటల విందవుతుంది
కాలం కదిలిపోవాలికదా అంటూ..
రాజీ తుపాకిని ఎత్తుకున్న
సిపాయి అవుతుంది
లోపలి మనిషి బయటి మనిషీ అంటూ
సెటైర్లె సాహిత్య సివంగవుతుంది

ఆమె నాకు పాఠమో
నేను ఆమెకు గుణపాఠమో అర్థంకాదు
నేను బండిపై బడిబాట పట్టగానే
ఆమె కెమెరా కన్నుల్ని
తగిలించుకొని
విపణిని వీక్షించే విహంగమవుతుంది

నేను ఇల్లు చేరుకోగానే
ఆమె బరువెక్కిన
సమాచార సంచవుతుంది
అలసిన నా దేహానికి
పలకరింపుల పాలను వొంపి
వార్తా పదబంధాల కోసం తనకుతానే
క్షీరసాగర మథనమవుతుంది
అక్షరాలే ఆమెకు ఆయుధం
అక్షరాలే ఆమెకు అమృతం

ఆశయాల లఖికతో కుస్తీ
మానవత్వ మల్లికతో దోస్తీ
ఎప్పుడూ ఆమె వ్యాపకం చైతన్య కారకం

అప్పుడప్పుడూ ఈ అడవిలో
మృగాల చూపుల ఘర్షణలో ఎరుపెక్కి
ఆటుపోటుల సముద్రమవుతుంది
పరిపరి విధాల పరివ్యాప్తమవుతున్న
రేపటి నిజం కోసం నిజంగానే
ప్రసవ వేదనల మాతృకవుతుంది

నిద్రపట్టక నినాదాలను నెమరేసుకుంటూ..
తిమిరాలను రాత్రంతా చీల్చుకున్న నాకు
ప్రతిరోజు ఆమె ఒక సూర్యోదయం

డాక్టర్ కటుకోర్ఝుల రమేష్
9949083327

ప్రకృతి పూల ఆరాధన

తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే ప్రత్యేకమైన, విలక్షణమైన పండుగ బతుకమ్మ. భాద్రపద అమావాస్య మొదలుకొని వరుసగా తొమ్మిది రోజులు ఆడుకొనే పండుగ ఇది. అన్ని పండుగల, పర్వదినాలలో భగవంతుని పూలతో ఆరాధిస్తే పూలను ఆరాధించే గొప్ప విశిష్టమైన పండుగ ఇది. ప్రజా ఉద్యమానికి, ప్రత్యేకించి మహిళా చైతన్యానికి, సమైక్యతకు ఒక నిలువెత్తు నిదర్శనం.

బతుకమ్మ ఆట పాటలు చోళుల, కాకతీయుల కాలం నుండి కొనసాగుతున్నట్టు బతుకమ్మ పాటల ద్వారా తెలుస్తోంది. ఆ కాలంలో జరిగిన అనేక యుద్ధాలలో విదేశీయులు మన గుళ్లను, గోపురాలను శిథిలం చేయడం, ఆడవాళ్లకు భద్రత లేకుండా చేయడం వల్ల కూడా బతుకమ్మ పుట్టుకకు కొంత దోహదం చేసింది. బతుకమ్మ పండుగ ఒక శిష్టాచారం కాకపోయినా ప్రజల సహృదయ నివేదనల రూపాంతరం. ఇందులో పాటల గళార్చన అమ్మ వారికిచ్చే సంగీత హారతి. ఒక ఆటలా ప్రదక్షణ చేస్తున్నట్టు గుండ్రంగా తిరుగుతూ మోగే చప్పట్లతో, ఆడబిడ్డలు ధరించిన కాళ్ళ గజ్జెల చప్పుళ్ళతో, ఆ తల్లికి చేసే భజనకు మేళతాళాలుగా భావించి అత్యంత ఉత్సాహంతో, సంబురంతో ఆడవారీ పండుగను చేసుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం.

తెలంగాణ మహిళలకు బతుకమ్మ గొప్ప పండుగ. వేములవాడలో బృహతమ్మ (పార్వతి)కి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఆమెకు మద్దతుగా ఉద్భవించిన మహిళా ఉద్యమమే బతుకమ్మ పండుగ అని ఒక కథనం ప్రచారంలో ఉన్నది. అందుకని వేములవాడలో జరిగే బతుకమ్మ పండుగలో అధిక సంఖ్యలో మహిళల భాగస్వామ్యం ఉండడం ఇప్పటికీ గమనించదగిన విషయం. దసరా పండుకకు ముందు తొమ్మిది రోజుల పాటు ఆటపాటలతో బతుకమ్మను ఒక పండుగగా రూపొందించుకున్నారు.

> ఒక్కేసి పువ్వేసి చందమామ
> ఒక్క జాములాయె చందమామ
> శివపూజ వేశాయె చందమామ
> శివుడు రాకపాయె చందమామ

చాళుక్యుల కాలంలో బతుకమ్మను చౌడమ్మ, పోచమ్మల రూపంలో ఆరాధించినట్లు తెలుస్తున్నది.

బతుకమ్మ పండుగ సందర్భంగా వివిధ రకాల పాటలు పాడుతారు. ఆ పాటల ద్వారానే ఇప్పటికీ మనం బతుకమ్మ పూర్వాపరాలు ఊహించుకో గలుగుతున్నాము.

వేముగంటి శుక్తిమతి

బతుకమ్మకు అక్షరార్చన

> శ్రీలక్ష్మీదేవియు ఉయ్యాలో
> సృష్టి బతకమ్మాయె ఉయ్యాలో
> ధర చోళ దేశమున ఉయ్యాలో
> ధర్మాంగుడనె రాజు ఉయ్యాలో

బతుకమ్మ పండుగ వర్షాకాలం చివరన, శీతాకాలం తొలిరోజుల్లో వస్తుంది కనుక చెరువులన్నీ నిండి, వివిధ రంగులతో రకరకాల పూలు విరబూస్తాయి. గునుగు, తంగేడు ,బంతి, చామంతి, అడవి చామంతి, పచ్చ గన్నేరు, నందివర్ధనం, రుద్రాక్ష, గోరింట, గుమ్మడి పూలతో చాలా అందంగా పేరుస్తారు.

చివరి రోజైన తొమ్మిదవ రోజును సద్దుల బతుకమ్మ అంటారు. ఆ రోజున పెద్ద బతుకమ్మను తయారు చేస్తారు. బతకమ్మ ఆడుకున్న ఇన్ని రోజులు ఆడపిల్ల తన అత్తింటి కష్టాన్ని, అలసటను మర్చిపోయి చిన్ననాటి స్నేహితులతో సంతోషంగా ఆడి పాడి తిరిగి తన అత్తారింటికి వెళ్ళడమే ఈ సద్దుల బతుకమ్మ. బతుకమ్మ తల్లికి నైవేద్యం పెట్టి ఆమెను సాగనంపడం సద్దుల బతుకమ్మగా పిలువబడింది.

(అక్షరయాన్ సౌజన్యంతో)

కలం పిలుపు

పోస్ట్ కార్డు కథల పోటీ

రమ్యభారతి పత్రిక ఆధ్వర్యంలో కోపూరి శ్రీనివాస్ స్మారక పోస్ట్ కార్డు కథల పోటీలు నిర్వహిస్తున్నది. సామాజిక స్పృహ కలిగిన ఏ అంశంమీదైనా కథలు పోస్ట్‌కార్డుపై మాత్రమే రాసి పంపాలి. ఒక రచయిత మూడు కథలు వరకు పంపవచ్చు. తెలుగు రచయితలెవరైనా కథల పోటీలో పాల్గొనవచ్చు. కథలు అక్టోబర్ 31లోగా 'రమ్యభారతి' పోస్ట్ పోస్ట్‌బాక్స్ నెంబర్.5, విజయవాడ-520 001 చిరునామాకు పంపాలి.

- చలపాక ప్రకాష్

నవల ఆవిష్కరణ

సృజన సాహితీ నల్లగొండ ఆధ్వర్యంలో బండారు శంకర్ రచించిన పిడికెడు మట్టి నవల ఆవిష్కరణ అక్టోబర్ 15న నల్లగొండలోని చిన్న వెంకట రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరుగుతుంది. డాక్టర్ బెల్లి యాదయ్య అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో గింజల నరసింహారెడ్డి, అంపశయ్య నవీన్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, మునాసు వెంకట్, కదిరే కృష్ణ, కార్టూనిస్ట్ శంకర్, వేనేపల్లి పాండురంగారావు, బండారు దానయ్య కవి పాల్గొంటారు.

- సృజన సాహితీ

తంగేడుపూల దేశం

ఒకానొక చీకటి యుగంలో
పరిమళం కూడా బంధించబడిన రోజుల్లో
బానిస చీకట్ల ఛాయలు
నా నేలనింకా వీడని చీకటి మాయాజాలంలో
కలలు కూడా ఖైదీ అయిన కాలరుతువు
అధిపత్యపు చీకట్లు నా వనమంతా అల్లుకుని
అవమానాల అణిచివేతల కింద
నా తంగేడుపూల వనం చుట్టూ
అనేక వివక్షల ముళ్లకంచెలు మొలిచిన సమయం
కాలం ఒక కొత్త చరిత్రను లిఖించింది

ప్రకృతి నా తంగేడు వనానికీ ఓ కొత్త భాషను నేర్పింది
నా నేల ఒక కొత్త పాఠాన్ని బోనంలా నెత్తికెత్తుకుంది

దేశం పాడ్డుపూల వైపు చూసింది
ఉద్యమ చైతన్య ఝరీ ప్రవాహంలో
తంగేడుపూలన్ని యుద్ధ నావలయ్యాయి
సునామీలా ఎగసిపడ్డ ఉద్యమ సముద్రం
ఉద్యమ గుబాళింపులో
అణిచివేతల అహంకారపు రక్త చరిత్రల సాక్షిగా
అనేక పూలు రక్తంతో తడిసి రాలిపడ్డా
దండలోని దారం నా తెలంగాణ ఆకృతిగానే రూపుదిద్దుకుంది

నా అస్తిత్వం తంగేడుపూల పరిమళమై
నా స్వేచ్ఛా పిపాస, పోరాట పటిమ
ప్రపంచం తలెత్తిచూసేలా చేసింది
అధిపత్యం పిల్లిలా తోకముడిచింది

సరిగ్గా దశాబ్దం క్రితం..స్వేచ్ఛ రెక్కలు తొడుక్కుని
సుపరిపాలన సుగంధాలు పులుముకుని
ప్రజల బతుకులకు బతుకమ్మల కొలువై నిలబడింది
పాలపిట్ట ప్రశాంత గీతాలు పాడుతూ
ప్రకృతిని పులకింపజేస్తోంది

ఒకానొక దీర్ఘకాల యుద్ధం గెలిచిన తరువాత
నేలంతా విజయోత్సాహంతో
పచ్చపూల పరిమళమై పరిఢవిల్లుతోంది

నా ప్రాంతమిప్పుడు ఒక రాష్ట్రం కాదు
ఒక తంగేడుపూల దేశం
ఒక దేశం జెండాకున్నంత పొగరుని
తలకెత్తుకున్న ఆత్మగౌరవ అస్తిత్వ సందేశం

చిత్తలూరి
91338 32246

తన పాటతో, కవిత్వంతో నిజాం పాలకులను ఎదిరించి ప్రజా పోరాటానికి ఒక ఊపును తీసుకువచ్చిన వాడు సుద్దాల హనుమంతు. నిజాం పాలనకు వ్యతిరేకంగా, గ్రామాల్లో భూస్వాముల దాష్టీకాలను ఎండగట్టడంలో సుద్దాల హనుమంతు ఒక దిక్సూచిలా పనిచేశాడు. పాటను ఆయుధంగా మలిచి పాలకుల గుండెల్లో గురిపెట్టిన సుద్దాల హనుమంతు పాటలు నిజాం వ్యతిరేక పోరాటం చేస్తున్న విప్లవకారుల పెదాలపైన అలవోకగా నర్తించేవి. ఆయన కవితలో ఆవేశం ఉంటుంది. ఆ అర్థాల్లో ఆలోచన ఉంటుంది. ఆ భావాల్లో సామాజిక స్పృహ ఉంటుంది. సామాజిక స్పృహతో ఆవేశంగా అర్థవంతంగా చేసే ఆలోచనే సుద్దాల కవిత.

యుద్ధగీతాల సుద్దాల

తెలంగాణ ప్రజలను అమితంగా ఆకట్టుకుని ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయిన 'పల్లెటూరి పిల్లగాడ పసుల కాసే మొనగాడ' పాట ఎంతగా ప్రాచుర్యం పొందిందో మనకు తెలిసిన విషయమే. నిరంకుశ నిజాం రాజ్యంలో గ్రామాల్లో భూస్వాముల కర్కశత్వం కింద నలిగిపోతున్న అమాయక ప్రజల స్థితి గతులను కండ్లకు కడుతూ వాళ్లను వెన్నుతట్టి పోరాటానికి సిద్ధం చేసేలా ఆయన గేయాలు ఉండేవి.నాటి నిజాం వ్యతిరేకోద్యమంలో బతికున్నంతకాలం ప్రజల బాణీలోనే పాటలందించి పోరాటాలకే తన జీవితాన్ని అంకితం చేసిన అచ్చమైన ప్రజా కవి సుద్దాల హనుమంతు.

> 'నీకు జీతము నెలకు కుంచెడు
> తాలు వలిపిడి కత్తి గాసం
> కొలవగ సేరు తక్కువ వచ్చాయా
> ఓ పాలబుగ్గల జీతగాడా'

ముక్కుపచ్చలారని పిల్లలను పశువుల కాపరులుగా పెట్టుకొని వాళ్ళను ఎన్ని విధాలుగా మోసం చేసేవారో.. సుద్దాల హనుమంతు కండ్లకు కట్టినట్టు చెప్పారు. ఇచ్చే జీతం నెలకు కుంచెడు గింజలే... అందులో తాలు, వలిపిడి కూడిన కత్తి గింజలు. యజమాని ఇచ్చిన ఆ కుంచెడు గింజలను ఇంటికి తెచ్చుకొని కొలిచి చూస్తే సేరు గింజలు తక్కువ వచ్చాయట. ఈ మోసాలను ఎక్కడా చెప్పుకోలేని దైన్య స్థితిని హనుమంతు గేయాలు విశదీకరిస్తాయి.

నిజాం వ్యతిరేక పోరాటంలో ప్రజలు అనేక పోరాట రూపాలను ఎంచుకున్నారు. ప్రత్యక్ష పోరాటంలోకి దిగిన పోరాటయోధులు ఆయుధం చేత బూని యుద్ధరంగంలోకి దిగితే కొందరు మేధావులు ప్రజా పోరాట భావజాలాన్ని విస్తరించడం కోసం పనిచేశారు. కవులు, రచయితలు, కళాకారులు... కవిత్వం, నాటకం, కథ, వ్యాసం లాంటి రూపాలలో తమ తిరుగుబాటును పాలకులకు తెలియజేశారు. సుద్దాల హనుమంతు పాటను తన పోరాట రూపంగా మలుచుకున్నారు. ప్రజా పోరాటంలో పాటకు ఉన్న మహత్తర శక్తిని ఆయన అంచనా వేయగలిగారు. కాబట్టే ఆయన పాటను పదునైన పోరాట రూపంగా మలవగలిగారు. పాటకు కూడా ఆయన వివిధ రూపాలను ఇచ్చారు. బుర్ర కథ, యక్షగానం, హరికథ మొదలైన ప్రక్రియలు ఆయన గేయాన్ని మరింతగా రాటు తేల్చాయి.

హనుమంతుకు విద్య పెద్దగా లేదు- కేవలం రెండవ తరగతి వరకు చదివాడు. వీధిబడిలో ఉర్దూ, తెలుగు భాషలు నేర్చుకున్నాడు. శత కాలు, కీర్తనలు, సీస, కంద పద్యాలు కంఠస్థం చేశాడు. బాల్యంలో యక్షగానాలు, కీర్తనలు, భజనల్లాంటి కళారూపాలంటే ఆసక్తి ఉండేది. అందుకే యక్షగానాల్లో పాత్రలు ధరించారు. గొంతెత్తి పాడటం నేర్చుకున్నాడు. చిన్నతనం నుంచే నాటకాలపై ఆసక్తిని పెంచుకున్న హనుమంతుకు ప్రజా కళారూపాలైన హరికథ, బుర్ర కథ, యక్షగానాలే తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రచార సాధనాలుగా ఉపయోగ పడ్డాయి. ఆయన బుర్రకథ చెబితే గడ్డిపోచ కూడా యుద్ధానికి సిద్ధమయ్యేదని జనంలో ప్రచారం బలంగా ఉండేది. హైదరాబాద్ సంస్థానంలో జరిగిన అనేక అక్రమాలను, భూస్వాముల దురాగతాలను, దొరల దౌర్జన్యాలను బుర్రకథల రూపంలో ఎండగట్టారు సుద్దాల.

> 'ఎన్నో ఆశలతో చెమటోడ్చి
> దున్నుకున్న బంజరు భూమి
> కన్నుగుట్టి మాయ పన్ని
> తన్ని గుంజుకునే భూస్వామి
> అన్నా నీవు కన్నకలలు
> వ్యర్థమాయేగదా'

అంటూ కష్టించి సంపాదించుకున్న నేల తనది కాకుండా ఎలా పోతున్నదో ఆ రైతుకు అర్థమయ్యేటట్టు రాసి పాడటంలో ఆయనకు ఆయనే సాటి. పల్లెటూరి పిల్లగాడ (మాభూమి), రణభేరి మో గింది తెలుగోడ, వేయ్ వేయ్ దెబ్బ, ప్రజా ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం, కన్నులో భగా భగా కడ్పుల్లో ధడా ధడా, భళిరె తెలంగాణ వహరె తెలంగాణ ఇలా ఎన్నో పాటలు ఆయ నకు పేరు తెచ్చాయి.

ఒక క్రమశిక్షణ గల కమ్యూనిస్టు కార్యకర్తగా, కవిగా, పోరాట యోధు డిగా, సామాజిక స్పృహ గల కళాకారుడి గా ఆయన తెలంగాణ పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచారు. సుద్దాలకు కళ ల పట్ల, గేయాల పట్ల మక్కువ ఎక్కువ. ఆ మక్కువతో ప్రజా పోరాటాలలో విచి త్ర వేషాలు, గొల్లసుద్దులు', లత్కోరు సాబ్', బుడబుక్కలు', ఫకీరువేషం', సాధువు' మొదలైన కళారూపాల ద్వారా పీడిత వర్గాల బాధల్ని, భావాల్ని వ్యక్తీకరించాడు.

> సుద్దాలకు ఊహ తెలిసినప్పటినుంచి అన్యాయాలను ఎదిరించే కమ్యూనిస్టు పార్టీతోనే ఆయన సంబంధం కొనసాగింది. కమ్యూనిస్టు పార్టీ 11వ మహాసభ భువనగిరిలో జరిగిన ప్పుడు ఒక వాలంటీర్‌గా ప్రవేశం పొందిన సుద్దాల హనుమంతు జీవితం కడవరకు కమ్యూనిస్టు పార్టీలోనే ఉన్నారు.

ప్రజా గేయాలను, పలు ప్రజా కళారూపాలను జనంలో ప్రదర్శించే సుద్